సాక్షి శ్రీకాకుళం

బుధవారం, 20, ఆగస్టు, 2025



భద్రతకు భరోసా ఏదీ..?

ఆలయాల్లో భద్రత కొరవడుతోంది. పద్మనాభ కొండపై పరికరాలు పనిచేయడం లేదు.

- 8లో



రాత్రి యూరియా అమ్మకాలా.?

యూరియాన రాత్రి పూట అమ్ముతున్నారు. నరసన్నపేటలో ఈ తంతు జరుగుతోంది.

- 8లో

పిచ్చి కుక్క స్వైర విహారం

కొత్తూరు: కొత్తూరులో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. నాలుగు రోడ్ల కూడలి నుంచి కొత్తూరు వైపు వస్తున్న పిచ్చి కుక్క కాలిన డకన వస్తున్న ఏడుగురిని కరిచి తీవ్రంగా గాయ పరిచింది. కొత్తూరుకు చెందిన ఎల్.నారాయణ మ్మ, శ్రీనివాసరావు పాణిగ్రాహీ, మాదాను గణప తిలతో పాటు మరికొందరిని కరిచింది. వీరంతా స్థానిక సీహెచ్‌సీలో వైద్యం పొందారు.

న్యూస్‌రీల్

'దళిత మహిళకు న్యాయం జరిగే వరకు పోరాటం'



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పొందూరు కేజీబీవీ నుంచి కంచిలి కేజీబీవీకి ప్రిన్సిపాల్ సౌమ్యను అక్రమంగా బదిలీ చేశారని, ఆమెకు న్యాయం జరిగే వరకూ దళిత సంఘాలు ఐక్యంగా పోరా టం చేస్తాయని పలువురు వక్తలు అన్నారు. స్థానిక అంబేద్కర్ విజ్ఞాన భవన్‌లో మంగళ వారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కొన్ని అసత్య ఆరోపణలతో బదిలీ చేయడమే కాకుండా, అనేక విధాలుగా వేధించినట్లు సౌ మ్య వెల్లడించిన నుంచి ఆమదాలవలస ఎమ్మె ల్యే కూన రవికుమార్ అనుచరులు సోషల్ మీ డియాలో సౌమ్యపైన ఆమె కుటుంబ సభ్యుల పైన తప్పుడు ప్రచారాలు చేస్తూ మానసిక క్షో భకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దీనిపై సీబీఐతో దర్యాప్తు చేయిం చాలని కోరారు. హోం మంత్రి తక్షణం జిల్లాకు వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల జిల్లా నాయకులు కంఠ వేణు, మాదిగ రిజర్వేష న్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు రానా శ్రీని వాస్, బొడ్డేపల్లి కృష్ణా, గరికివాడు, కులనిర్మూ లన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, దళిత ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, బడే కామరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు పొన్నాడ రుషి తదితరులు పాల్గొన్నారు.

పడిగాపులే మిగిలాయి



ఎంపీడీఓ కార్యాలయం వద్దకు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన దివ్యాంగులు

నరసన్నపేట: 'మాకేంటీ బాధలు.. మాపై ఎం దుకు ఈ కక్ష.. ఇలా ఎన్నాళ్లు తిరుగుతాం. ఇం కెన్నాళ్లు తిరగాలి..' అని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకల్యం నిరూపించుకోవ డానికి రీ వెరిఫికేషన్ కోసం ప్రభుత్వం నోటీ సులు పంపిస్తుండడంతో దివ్యాంగులు శ్రమ కోర్చి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఎం తో కష్టపడి ఇంటి నుంచి ఆస్పత్రికి వస్తుంటే.. 'ఇప్పుడు మీకు వైకల్య శాతం తక్కువగా ఉం ది. మీ పింఛన్ కట్ చేస్తున్నాం. మీరు అర్హులైతే ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసు కోండి. మళ్లీ మీకు సదరంకు పిలుస్తాం. అం దులో మళ్లీ సర్టిఫికెట్ జనరేట్ అవుతుంది. అప్పుడు అర్హులైతే పింఛన్ వస్తుంది' అని అధి కారులు చెబుతున్నారు. మంగళవారం నరస న్నపేట ఎంపీడీఓ కార్యాలయానికి పెద్ద సం ఖ్యలో దివ్యాంగులు మడపాం, రావులవలస, సత్యవరం గ్రామాల నుంచి వచ్చారు. కళ్లనీళ్ల పెట్టుకుంటూ ప్రభుత్వాన్ని నిందించారు.

- ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై కేసు నమోదు చేయాలి
- వైఎస్సార్‌సీపీ నేతలు మేరుగ నాగార్జున, ధర్మాన కృష్ణదాస్ డిమాండ్
- కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్యకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది: ఎమ్మెల్సీ కుంభా రవిబాబు
- కూన రవి రాజీనామా చేయాలి: రెడ్డి శాంతి
- రిమ్స్‌లో సౌమ్యకు వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



రిమ్స్ ఆస్పత్రి వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు మేరుగ నాగార్జున, కుంభా రవిబాబు, ధర్మాన కృష్ణదాస్ తదితరులు

దళితులంటే ఎందుకంత చులకన..?

శ్రీకాకుళం:

దళిత సామాజిక వర్గానికి చెందిన పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్యను వేధించిన ఆమదాలవ లస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఆయన అనుచరుల పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున డిమాండ్ చేశారు. దళితులన్నా, దళిత మహిళలన్నా చంద్రబాబు అండ్ కోకు చిన్నచూపు అని మండిపడ్డారు. ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సౌమ్యను రిమ్స్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. సౌమ్యకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటా మని భరోసానిచ్చారు.ఈసందర్భంగా మేరుగ నాగా ర్జున మాట్లాడుతూ.. టీడీపీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా దళితులపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవలే గుంటూరులో ముస్లిం మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకుందని తెలిపారు. ఆర్‌అం డ్‌బీ ఉద్యోగి కొరప కల్యాణిని మంత్రి అచ్చెన్నాయు డు బూటుకాలితో తన్నారని గుర్తుచేశారు. ఆమదాల వలసలో కోటిపల్లి రాజు అనే వ్యక్తి ఓ చిన్నారిపైన అఘాయిత్యం చేస్తే కేసు కూడా లేదన్నారు. పలా స-కాశీబుగ్గలో ఓ విద్యార్థినిపై దాడి చేస్తే వారిపైనా కేసులు నమోదు చేయలేదన్నారు. పెందుర్తి నియోజ కవర్గం జెర్రిపోతులపాలెంలో ఓ మహిళను వివస్త్రను చేస్తే నేషనల్ ఎస్సీ కమిషన్‌కి ఫిర్యాదు చేశాక స్పం దించారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో జన సేన ఎమ్మెల్యే దళిత డాక్టర్‌ని చెంపదెబ్బ కొడితే కేసు లు పెట్టలేదన్నారు. నెల్లూరు జిల్లాలో రాంపుర్‌లో పల్లెలో వెలివేసి కొడితే వందల మంది ఊరు వదిలి వెళ్లిపోయారన్నారు. నెల్లూరులో మాజీ శాసన సభ్యు డి ఇంటి మీద దాడి చేస్తే అడిగేవారే లేరన్నారు. చం ద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోనూ దళి తులను చిన్నచూపు చూస్తున్నారని తెలిపారు. గతం లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో సర్వే ప్రకారం రాష్ట్రం 4వ స్థానంలో ఉంటే ఇప్పుడు అదే సర్వేలో ఒకటి రెండు స్థానాల్లో ఉండటం సిగ్గుచేటన్నారు. సౌమ్యకు న్యాయం జరి గేంతవరకు పోరాటం చేస్తామని భరోసానిచ్చారు.



రిమ్స్‌లో సౌమ్యతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రబాబు చోద్యం చూస్తున్నారు

వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు మాట్లాడుతూ జరుగుతున్న సం ఘటనలపై సీఎం చంద్రబాబునాయుడు చోద్యం చూస్తున్నారే తప్ప ఏ ఒక్కరిపైనా చర్యలు తీసు కున్న సందర్భాలు లేవన్నారు. రాష్ట్రంలో దళిత అధి కారులు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను సైతం వదలకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కూ టమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి దళిత, గిరిజన వర్గాల వారంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

వైఎస్ జగన్ దళితులకు అగ్రపీఠం వేశారని, ఏనాడూ చిన్నచూపు చూడలేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. తమ హయాంలో దళితులకు అన్ని రకాలుగా మేలు చేశామని తెలిపారు.

పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ ఓ మహిళగా సౌమ్య పరిస్థితి చూ స్తుంటే బాధగా ఉందన్నారు. దళిత మహిళే హోం మంత్రిగా ఉన్నా దళిత మహిళలకు అన్యాయం జరిగితే కనీసం స్పందించకపోవడం అన్యాయమ న్నారు. బాధితురాలికి న్యాయం చేయాల్సింది పో యి తిరిగి తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నా రు. కూన రవి తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనా మా చేయాలని డిమాండ్ చేశారు.

సౌమ్యను పరామర్శించిన వారిలో జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామా రావు, వైఎస్సార్ సీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవి కుమార్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, వైఎస్సార్‌సీపీ తూర్పుకాపుకుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, కళింగ వైశ్య కుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పోలి నాటి వెలమ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాస రావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషో త్తం, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృ ష్ణమూర్తి, మాజీ అధ్యక్షుడు పొన్నాడ రుషి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు రౌతు శంకరరావు, నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, ఎస్సీ సెల్ శ్రీకాకుళం నియోజ కవర్గం ఇన్‌చార్జి యజ్జల గురుమూర్తి, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, బొడ్డేపల్లి రమేష్, గొండు రఘురాం, వైపీ శ్రీధర్, మూకళ్ల తాతబాబు, పీస గోపి, కంఠ వేణు, బోసు మన్మధరావు, జలగడుగుల శ్రీనివాసరావు, పత్రి రాజారావు, పంకు ప్రసాద్, సురారపు త్రినాథ, యలమల కృష్ణ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను ఎదుర్కోలేకే..

నేను ఏ తప్పూ చేయలేదు. ఎమ్మెల్యే కూన రవి నిత్యం వేధించేవారు. ఆయనను ఎదుర్కోలేకే మన స్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయ త్నించాను. స్కూల్‌కి వెళ్లి అక్కడ స్టాఫ్‌ని భయపెట్టి బలవంతంగా తప్పుడు సంతకాలు చేయించి తప్పు డు రిపోర్టులు ఇచ్చారు. సోషల్ మీడియాలో తప్పు డు పోస్టులు పెట్టి వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కి విన్నవిం చుకున్నాను.

– వైఎస్సార్ సీపీ నేతలతో కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య

అంత పిరికి కాదు..

మా అక్కను తీవ్రంగా బాధ పెట్టారు. ఆమె తప్పు లేకపోయినా ఇబ్బంది పెట్టడంతోనే ఆత్మహత్య ఆలోచన చేసింది. మా అమ్మ,నాన్న బాగా చదువు కున్న వారు. సమాజంలో గౌరవం కోసమే సౌమ్య ఉద్యోగం చేస్తోంది. మాకు, మా కుటుంబానికి ప్రాణహాని ఉంది. మాకు రక్షణ కల్పించాలి.

– యువరాజు, సౌమ్య సోదరుడు

● వెనకే వస్తారు..

తెంచుకెళ్లిపోతారు!

- జిల్లాలో మళ్లీ రెచ్చిపోతున్న గొలుసు దొంగలు
- నిందితుల్లో చాలా మంది ఒడిశా వాసులే
- ఒంటరిగా వెళ్లే వారే టార్గెట్



శ్రీకాకుళం క్రైమ్ : ఒంటరిగా రోడ్డుపై నడిస్తే భయం.. తోడు లేకుండా పొలానికి వెళ్లాలన్నా వణుకే.. మెడలో బంగారం వేసుకుని బయటకు రావాలంటే సంశయించాల్సిన పరిస్థితి. ఒడిశా గ్యాంగ్ చేతివాటానికి సిక్కోలు వాసులు టార్గెట్ అవుతున్నారు. నిన్న రణస్థలం.. మొన్న బురిడి కం చరాం.. ఇలా హైవే పక్కన ఉన్న గ్రామాలే లక్ష్యం గా గొలుసు చోరులు రెచ్చిపోతున్నారు. ఈ గొలు సు దొంగతనాలకు పాల్పడుతున్నది ఒడిశాకు చెం దిన గ్యాంగ్‌గా ఇప్పటికే పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. గ్యాంగ్‌కు చెందిన ఇద్దరిపై అనుమా నం ఉన్నట్లు, జిల్లాలో పలు గొలుసు దొంగతనాల్లో వీరి హస్తమున్నట్లు.. వీరికి మరికొందరితో లింకు లున్నట్లు అనుమానిస్తున్నారు. వీరి కోసం పోలీ సులు తీవ్రంగా గాలిస్తున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు

- ఈ నెల 11న రణస్థలం మండలం అర్జునవలస పంచాయతీ గిడిజాలపేటరహదారిపై ఓ విద్యా ర్థిని మెడలో చైన్ తెంపి పరారయ్యారు.
- ఈ నెల 8న పొందూరు మండలం బురిడి కం చరాం గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు ఎస్ఎంపురం రోడ్డులో పొలాన్ని చూడటానికి వెళ్తుండగా వెనుకగా వచ్చిన అగంతకుడు మూడు తులాల తాడు తెంపేసి పారిపోయాడు.
- ఈ నెల 4న ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట పం చాయతీ వరం కాలనీలో మార్నింగ్ వాక్ చేస్తున్న వరలక్ష్మి మెడలో రెండున్నర తులాల పుస్తెల తాడు తెంపి ఓ వ్యక్తి పరారయ్యాడు.
- గత నెల 15న శ్రీకాకుళం మండలం సింగుపురా నికి చెందిన ఓ మహిళ ఏటీఎం సెంటర్‌లో డబ్బులు తీసుకొని వస్తుండగా ముఖానికి మాస్కులు పెట్టిన వ్యక్తులు నంబర్ ప్లేట్లు లేని ద్విచక్రవాహనంపై వచ్చి 3 తులాల బంగారు తాడు తెంపేసి పరారయ్యారు.

జైలు నుంచి విడుదలై..

ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురానికి చెందిన సుజిత్‌కుమార్ పాడి, బాలకృష్ణ సాహులు జిల్లాలో నాలుగుచోట్ల పుస్తెల తాడుల చోరీలకు పాల్పడి ఈ ఏడాది జనవరి 10న కొత్తూరు పోలీసులకు చిక్కి జైలుకెళ్లారు. అప్పటికే జిల్లాలో 2016 నుంచి 2024 వరకు 32 నేరాలు చేసిన ఘనత వీరిది. మళ్లీ బెయిల్‌పై బయటకొచ్చారో లేదో.. ఇదే ఏడాది జూన్‌లో మెళియాపుట్టి మండలం శేఖరాంపురం గ్రామంలోని పొలం పనుల్లో ఉన్న ఓ మహిళ మెడలో పుస్తెల తాడు తెంపేసి బైక్‌పై పరారయ్యా రు. అదేరోజు బరంపురంలో సైతం ద్విచక్రవా హనం దొంగిలించారు. నేరాలు చేసి జైలుకెళ్లినా మళ్లీ దర్జాగా బయటకొచ్చి చోరీలు చేస్తుండటం జిల్లావాసులను విస్మయపరుస్తోంది.

బ్యాగులను తెంపేస్తారు..

- గత నెలలో గార మండలం దీపావళి గ్రామానికి చెందిన ఓ మహిళ పలాసకు బస్సులో వెళ్తుం డగా అనకాపల్లికి చెందిన ఓ మహిళ బ్యాగు కొట్టేసింది. అందులో నాలుగున్నర తులాల చైన్, తులంన్నర చైన్ నెక్లెస్ ఉన్నాయి. ఈమె పలు చోరీకేసుల్లో నిందితురాలు.
- గత నెలలోనే జేఆర్ పురం మండలకేంద్రంలో వస్త్రదుకాణంలో డ్వాక్రా సభ్యుల వద్ద డబ్బులున్న బ్యాగులను కోసేసి పరారయ్యారు.
- జూన్‌లో ఆటోల్లో ఎక్కే వృద్ధ దంపతులే లక్ష్యంగా ఎచ్చెర్ల, శ్రీకాకుళం రెండో పట్టణ పీఎస్‌ల పరి ధిలో కొందరు మహిళలు బ్యాగులు కోసేసి పారి పోయారు. అనంతరం వీరిని పట్టుకున్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి..



ఒంటరిగా మహిళలు నడిచి వెళ్లే టప్పుడు, ప్రయాణించేటప్పుడు చున్నీ గానీ, చీరకొంగు గానీ కప్పుకునే వెళ్లాలి. ఆభరణాలు కనిపించేలా ఉండరాదు. వెనక, ముందు ఎవరు వస్తున్నారన్నది ఎప్పటికప్పుడు గ్రహించాలి. 45 ఏళ్ల పైబడ్డ మహిళలనే చైన్ స్నాచర్లు టార్గెట్ చేస్తారు. శ్రీకాకుళం పీఎన్‌కాల నీయే కాక పలు చోట్ల విద్యుత్ దీపాలు వెలగకపోవడమే కాక సీసీ కెమెరాలు సైతం నివా సగృహాలవారు పెట్టుకోకపోవడంతో దొం గతనాలు జరుగుతున్నాయి.

– పి.ఈశ్వరరావు, సీఐ, శ్రీకాకుళం టూటౌన్

నీరు.. కన్నీరాయె..

రెండున్నరేళ్ల పిల్లాడు.. ఆ నీటి లోపల మునిగిపోతూ అమ్మను ఎంత తలచుకున్నాడో.. నాన్నను ఎంతగా పిలిచాడో. ఊపిరి అందక ఎంత విలవిలలాడిపోయాడో.. ఇంటి పక్కన తీసిన పెంట గొయ్యి ఆ పిల్లాడికి మృత్యు కుహరంలా మారింది. వాన నీటికి నిండిన గోతిలో దాగున్న మృత్యుదేవత చిన్నారిని అమాంతం మింగేసింది. బద్రి గ్రామంలో జరిగిన ఈ విషాద సంఘటనతో ఊరుఊరంతా శోకంలో మునిగిపోయింది.



మృతి చెందిన బాలుడు

- పెంట గోతిలో పడి బాలుడి మృతి
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

సారవకోట: మండలంలోని బద్రి గ్రామంలో మం గళవారం పెంట గొయ్యిలో పడి ఆ గ్రామానికి చెందిన శిమ్మ లోకేష్ అనే బాలుడు మృతి చెందా డు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివ రాలు ప్రకారం.. బద్రి గ్రామానికి చెందిన శిమ్మ దాలినాయుడు, హేమలతలకు మౌళి, లోకేష్ ఇద్దరు కుమారులు. వీరిలో చిన్న కుమారుడైన లోకేష్‌కు 2 ఏళ్ల 4నెలల వయసు ఉంటుంది. మం గళవారం ఉదయం తల్లి హేమలత కుళాయి నీళ్ల పట్టుకునేందుకు వెళ్లగా ఆమె వెంట బాలుడు కూ డా వెళ్లాడు. ఆ ఇంటి పక్కనే జాతీయ ఉపాధిహా మీ పథకంతో కంపోస్టు ఎరువుల తయారీ కోసం తీసిన పెంట గొయ్యి వాన నీటితో నిండి ఉంది. అమ్మతో వెళ్లిన బాలుడు అటుగా వెళ్లి గోతిలో పడి పోయాడు. దీన్ని ఎవరూ గమనించలేదు. తల్లి నీళ్లు పట్టుకుని కుమారుడి కోసం వెతకగా ఆ గోతిలో మృతదేహం తేలడంతో ఆమె దిగ్భ్రాంతి కి గురయ్యారు. వెంటనే బాలుడిని బయటకు తీ సి బుడితి సీహెచ్‌సీ తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు అక్కడి సిబ్బంది చెప్ప డంతో గుండెలవిసేలా రోదించారు. గంట క్రితం వరకు ఇంటిలో అల్లరి చేస్తూ ఆడిన పిల్లాడు అలా చలనం లేకుండా పడి ఉండడం చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



బాలుడిని బలిగొన్న పెంట గొయ్యి

గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 120 పెంట గొయ్యిలను మూడు నెలల కిం దట తవ్వించారు. ప్రస్తుతం వర్షాలకు ఈ పెంట గొయ్యిలు నీటితో నిండి ఉన్నాయి. పిల్లలు అటు గా తిరిగేటప్పుడు జాగ్రత్త వహించాలని అధికారులు సూచిస్తున్నారు.

ముంచెత్తిన వరద



▶▶ వంశధారలో పెరిగిన వరద

తుఫాన్ ప్రభావానికి కురిసిన వర్షంతో ప్రధాన నదులకు వరద పోటెత్తింది. ఒడిశా క్యాచ్ మెంట్ ఏరియాలో వానలు పడడంతో వరద నీరు నదుల్లోకి ముంచెత్తింది. జిల్లాలోనూ మంగళవారం పలుచోట్ల జల్లులు కురిశాయి. పాతపట్నం నియోజకవర్గంలో గెడ్డలు పొంగి ప్రవహించాయి.

హిరమండలం: హిరమండలం వంశధార గొట్టా బ్యారేజీ వద్ద మంగళవారం ఉదయానికి వరద నీరు పెరిగింది. ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాతో పాటు రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలకు వంశధారలో వరద నీరు వచ్చి చేరుతోం ది. గొ ట్టా బ్యారేజీ వద్ద గరిష్ట నీటి మట్టం 38.10 మీటర్లు కాగా ప్రస్తుతానికి 38.08 మీటర్ల వరకు నీరు ఉంది. సోమవారం సాయంత్రానికి 10,357 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. మంగళవారం నాటికి 22వేలకు పెరిగింది. వచ్చిన నీటిని 11 గేట్లు 20 సెంటీమీటర్ల మేర పైకి ఎత్తి 20651 క్యూసెక్కులు దిగువకు విడిచిపెట్టినట్లు డీఈ సరస్వతి తెలిపారు. ఎడమ ప్రధా న కాలువ ద్వారా 1430 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్లు డీఈ తెలిపారు.

▶▶ 750 ఎకరాల్లో ముంపు బారిన పంట పొలాలు

సరుబుజ్జిలి: మండలంలో సుమారు 750 ఎకరాల్లో వరి పంట ముంపు బారిన పడింది. ప్రధానంగా కూన జమ్మన్నపేట, వీరభద్రాపురం, శ్యాస్త్రుల పేట, వీరభద్రాపురం, తురకపేట, వ్యాసులపేట, ఎంఎస్ పురం, వీరమల్లిపేట, బుడ్డివలస, సింధు వాడ గ్రా మాలకు చెందిన సుమారు 750 ఎకరాల వరి పంట ముంపు బారిన పడింది. కాలువ పనులు సరిగా చేయకపోవడం వల్ల పొలాల్లోకి నీరు వచ్చేస్తోందని రైతులు చెబుతున్నారు.



తురకపేట వద్ద ముంపునకు గురైన పంటపొలాలు

▶▶ వంటశాలపై కూలిన చెట్టు



పాతపట్నం: కోనంగిలో పాఠశాల వంటశాలపై కూలిన చెట్టు

పాతపట్నం: కోనంగి గిరిజన గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో కాము చెట్టు వానకు కూలి వంటశాల షెడ్‌పై పడడంతో షెడ్ ధ్వంసమైంది. పాఠశాలకు సెలవులు కావడం తో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

▶▶ ఇంటిలోకి వర్షం నీరు



పాతపట్నం: సూర్యనారాయణపురంలోని ఇంటి లోకి చేరిన వర్షం నీరు

పాతపట్నం: కోదూరు పంచాయతీ సూర్యనారాయ ణపురం గ్రామంలో సోమవారం రాత్రి ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. దీంతో గ్రామస్తులు మంగళ వారం ఉదయం తహసీల్దార్ ఎస్.ప్రసాదరావుకు, ఎంపీడీఓ చంద్రకుమారిలకు తెలియజేశారు.

▶▶ సీహెచ్‌సీలోకి వాననీరు

కొత్తూరు: తుఫాన్ కారణంగా మూడు రోజుల నుం చి కురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక సీహెచ్‌సీ కారి పోతోంది. దీంతో రోగులు అవస్థలు పడుతున్నారు. మంచాల మీద నీరు పడుతుండడంతో వాటిని పక్కకు నెట్టి వైద్యం అందిస్తున్నారు. గచ్చులు కూడా జారుతున్నాయి. మంగళవారం 200 మంది రోగులు రావడంతో మంచాలు చాలలేదు.



కొత్తూరు: సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాలుడి మంచం వద్ద వాననీరు

▶▶ కాజ్‌వేపై నుంచి..

పాతపట్నం: పాతపట్నం నీలకంఠేశ్వరం ఆలయం వద్ద ఉన్న కాజ్‌వే బ్రిడ్జిపై నుంచి మంగళవారం సాయంత్రం మహేంద్ర తనయ పొంగి ప్రవహిస్తోంది. నదిలో నీరు పెగడంతో కాపుగోపా లపురం, హరిజన గోపాలపురం గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి.



పాతపట్నం: మహేంద్ర తనయ నది కాజ్‌వే వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

▶▶ ఉద్ధృత ప్రవాహం



పెద్దరోకళ్లపల్లి వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ నుంచి పసిబిడ్డతో అవతలి వైపునకు వెళ్తున్న గ్రామాల ప్రజలు

టెక్కలి: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో టెక్కలి మం డలం పెద్దరోకళ్లపల్లి వద్ద గెడ్డ ప్రవాహం ఉద్ధృతంగా మారింది. దీంతో పెద్దరోకళ్లపల్లి, సీతారాంపల్లి, రామనగరం తదితర గ్రా మాలకు ప్రజలంతా బిక్కు బిక్కుమంటూ రాకపోకలు సాగిస్తు న్నారు.

▶▶ బాహుదాకు వరద



బాహుదా నదికి చేరిన వరద నీరు

ఇచ్ఛాపురం: గడిచిన రెండు రోజులుగా విస్తారంగా కురు స్తున్న వర్షాల కార ణంగా బాహుదా నదికి వరద నీరు చేరింది. నదీ పరివాహక ప్రాం తాల్లోని లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు జలమ యమయ్యాయి.



తురకపేట దబ్బపాడు మధ్య కడపలవాని గెడ్డ వద్ద రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

▶▶ బాహ్య ప్రపంచానికి దూరం

హిరమండలం: ఎల్ఎన్ పేట మండలం దబ్బపాడు గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగి పోయాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షా లకు కడపలవానిగెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో దబ్బపాడు గ్రామ ప్రజలు బయటకు రావడానికి కూడా వీల్లేకుండాపోయింది. ఏటా కడపలవానిగెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో వరద ఉన్న సమయం లో ఆ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఇక్కడ వంతెన నిర్మాణానికి వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. పనులు కూడా అప్పటి ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రారం భించారు. కానీ ఆ పనులను కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లడం లేదు.

క్లుప్తంగా

లారీ డ్రైవర్‌కు జైలుశిక్ష

ఎచ్చెర్ల : మద్యం మత్తులో లారీని నడుపుతూ ప్రమాదానికి కారణమైన విజయవాడకు చెందిన డ్రైవర్ నాగరాజుకు జిల్లా సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ 60 రోజుల జైలు శిక్ష విధించారు. ఎచ్చెర్ల మండలం కింతలి మిల్లు జంక్షన్ వద్ద సోమవారం అర్ధరాత్రి విజయవాడ నుంచి వస్తున్న లారీ డ్రైవర్ నాగరాజు రాంగ్‌రూట్‌లో డ్రైవ్ చేస్తూ విశాఖ నుంచి ఒడిశా వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఒడిశా లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మద్యం మత్తులో లారీని నడిపిన డ్రైవర్ నాగరాజుపై కేసు నమోదుచేసి కోర్టుకు తరలించగా 60 రోజులు జైలు శిక్షను విధించారని ఎస్సై సందీప్‌కుమార్ మంగళవారం తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితురాలు

మెళియాపుట్టి: పట్టుపురంలో కాంచనే అనే మహిళపై దాడి చేసి పారిపోయిన ఘటనలో అనుమానితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పాతపట్నం సీఐ వి.రామారావు తెలిపారు. పూర్తి వివరాలు బుధవారం తెలియజేస్తామన్నారు.

రాత్రిపూట యూరియా అమ్మకాలా?



మంగళవారం రాత్రి ఆటోల్లో యూరియా లోడ్ చేస్తున్న కలాశీలు

నరసన్నపేట: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏర్పాటైన సొసైటీల్లో చీకటి పడ్డాక యూరియా అమ్మకాలు చేస్తుండటం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. నరసన్నపేట సొసైటీకి మూడు రోజుల కిందట 400 బస్తాల యూరియా వచ్చింది. ఆదివారం రైతులు అధికంగా చేరడం.. వాగ్వాదం జరగడంతో యూరియా పంపిణీ చేయలేదు. రెండో రోజు కొంత మంది రైతులకు ఒక్కో బస్తా చొప్పున ఇచ్చారు. మిగిలిన యూరియాను మంగళవారం రాత్రి విక్రయాలు చేపట్టారు. ఆటోలు, లగేజీ వాహనాల్లో బస్తాలను ఇష్టానుసారంగా సరఫరా చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులకు ఇవ్వాల్సిన యూరియా పక్కతోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ అధికారులు పూర్తిగా పట్టించుకోకపోవడంతో సొసైటీకి వచ్చిన యూరియా పక్క దారి పట్టిందని, కావాల్సిన వారికి లెక్కకు మించి పంపిణీ చేశారని పలువురు రైతులు అంటున్నారు.

'కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారు నేడు హాజరుకావాలి'

శ్రీకాకుళం రూరల్: గత డిసెంబర్, జనవరి నెలల్లో ఎచ్చెర్ల పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కానిస్టేబుళ్ల ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు హాజరై సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులంతా ఈ నెల 20న బుధవారం శ్రీకాకుళం రూరల్ మండలం తండేంవలసలోని పోలీసు శిక్షణా కేంద్రం (ఆర్‌టీఓ కార్యాలయం దరి) ఉదయం 9 గంటలకల్లా హాజరుకావాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సెలక్షన్ ప్రక్రియలో దరఖాస్తుతో జతపర్చిన అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, ఇటీవలే తీయించిన మూడు పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు, హాజరైన అభ్యర్థి అటస్టేషన్ ఫారం పూర్తి వివరాలతో పాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని పేర్కొన్నారు.

ఓ బొజ్జ గణపయ్య..
జీవనాధారం నీవేనయ్యా..!

- విగ్రహాల తయారీనే నమ్ముకున్న కళాకారులు
- స్థానికులతో పాటు ఉత్తరాది రాష్ట్రాల నుంచి రాక
- ట్రెండ్‌కు తగ్గట్టు రూపుదిద్దుకుంటున్న విగ్రహాలు
- వారం రోజుల్లో నవరాత్రి ఉత్సవాలు



తుదిమెరుగులు దిద్దుతున్న మహిళా కళాకారులు

వజ్రపుకొత్తూరు రూరల్ :

వినాయక చవితి సందడి మరో వారం రోజుల్లో మొదలుకానుంది. భాద్రపద శుక్లపక్ష చవితి నాడు ప్రారంభమై నవరాత్రులు ఎంతో వైభవంగా జరుపుకునే ఈ ఉత్సవం ఈ నెల 27న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కళాకారులు విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. విగ్రహాలు తయారు చేసే కళను నమ్ముకొని వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ఏడాదికి ఒకసారి వచ్చే వినాయక చవితి ఉత్సవాలకు అవసరమైన బొజ్జ గణపయ్య విగ్రహాలను కళాకారులు తయారు చేసి ఏడాదికి సరిపడ ఆదాయాన్ని అర్జించి కుటుంబాన్ని పోషిస్తుంటారు. ప్రధానంగా ఈ సీజన్‌లో రాజస్థాన్, కోల్‌కత్తా, రాజమండ్రి తదితర ప్రాంతాలలో పాటు జిల్లాలో ఉన్న పొందూరు, నరసన్నపేట, కోటబొమ్మాళి, కాశీబుగ్గ, హరిపురం తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 200 విగ్రహా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది కళాకారులు, వ్యాపారులు, కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఉత్సవాలకు మూడు నెలల ముందు విగ్రహాల తయారీ కేంద్రాలను ఎంపిక చేసుకొని అవసరమైన ముడి సామగ్రిని లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసుకొని సేకరించి నిల్వపెట్టుకున్నారు. రెండు నెలల ముందు విగ్రహాలను తయారీ చేయడం ప్రారంభించారు. ఉత్సవానికి సమయం దగ్గర పడటంతో విగ్రహాలకు తుది మెరుపులు దిద్దుతున్నారు.

ట్రెండింగ్‌కు అనుగుణంగా..

ఏటా ట్రెండింగ్‌లో ఉన్న వినాయక విగ్రహాలకు ఆదరణ పెరుగుతోంది. పూజా కమిటీ నిర్వాహకుల అభిరుచికి తగ్గట్టుగా రకరకాల ఆకృతిలో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. 2 అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారీ చేసి మార్కెట్‌లో అమ్మకాల కోసం సిద్ధం చేస్తున్నారు. విగ్రహాల మోడల్, సైజ్ బట్టి ఒక్కొక్క విగ్రహాన్ని రూ.2 వేల నుంచి రూ.20 వేల వరకు అమ్మకాలు చేస్తున్నారు. కళాకారులు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి విగ్రహాలు తయారీ చేస్తున్నారు. అయితే తాము ఆశించిన స్థాయిలు విగ్రహాలు అమ్ముడుపోతేనే తమ కుటుంబ పోషణకు భరోసా దొరుకుతుందని, లేదంటే నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని కళాకారులు చెబుతున్నారు.



విగ్రహాలను ఆసక్తిగా తిలకిస్తున్న యువకులు

మా జీవనాధారం..



తరతరాలుగా విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఏటా మూడు నెలల ముందు నుంచే ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటాం. ట్రెండింగ్‌కి తగ్గట్టుగానే 3 అడుగుల విగ్రహం నుంచి 12 అడుగు ఎత్తు వరకు విగ్రహాలు తయారు చేస్తున్నాం. అన్ని విగ్రహాలు అమ్ముడుపోతే ఆశించిన లాభాలు వస్తాయి. లేదంటే నష్టం భరించాలి.

– కె.శంకర్, విగ్రహ తయారీదారుడు, పొందూరు

అభిరుచికి తగ్గట్టు..,



ఈ ఏడాది వినాయక విగ్రహాలు ముందుగానే బుకింగ్ అవుతున్నాయి. తయారైన విగ్రహాలను యువకులు చూసి వారికి నచ్చిన బొమ్మను బుక్ చేసుకుంటున్నారు. వారి కోరిక మేరకు విగ్రహాలకు రంగులు దిద్దుతున్నాం. అందరు ఆకర్షించేలా విగ్రహాలు మార్కెట్‌లోకి తీసుకువస్తున్నాం.

– కె.నారాయణరావు, కళాకారుడు, పొందూరు

కులవృత్తిని నమ్ముకున్నాం..



తరతరాలుగా వస్తున్న కులవృత్తిని నమ్ముకొని ఏడాది పొడవునా ఇటుకలను తయారీ చేస్తుంటా. వినాయక ఉత్సవాలు సీజన్‌లో మాత్రం నాకు దేవుడు ప్రసాదించిన కళతో వినాయక విగ్రహాలను తయారీ చేస్తాను. చాలా అనందంగా ఉంది.

– యూ.రాజు, కళాకారుడు, బెండి గేట్, వజ్రపుకొత్తూరు

దళితుల ఐక్యతపై కుట్ర

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

ఎస్సీ వర్గీకరణ పేరిట దళితుల ఐక్యతపై ప్రధాని మోదీ, ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు రాజకీయ కుట్ర పన్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.ఆర్.ఎస్.రత్నాకర్ అన్నారు. కులగణన జరగకుండా ఎస్సీ వర్గీకరణ ఎలా చేపట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాల సామాజికవర్గంపై చంద్రబాబు పగతీర్చుకుంటున్నారని, మాలలకు అన్యాయం జరుగుతున్నా ఈనాటికీ స్పందించలేదన్నారు. ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందేనన్నారు. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని తొక్కేస్తుంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. రిజర్వేషన్లతో లబ్ధి పొందిన మాల ఉద్యోగులు ఇప్పటికైనా కళ్లు తెరిచి తమ పోరాటానికి మద్దతిస్తే మన రిజర్వేషన్లు కాపాడుకోగలుగుతామన్నారు. శాంతియుత పోరాటానికి మనమంతా సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అలికాన మహేష్‌కుమార్, యామల కృష్ణ, బొచ్చా శశిభూషణ్‌రావు, కాకర రవితేజ, కూసి కొండబాబు, నెల్లి సూరిబాబు, నూకరాజు, కనికెళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఈ–డివిజనల్ మేనేజర్ పోస్టు రాత పరీక్ష ఆగస్టు 10న నిర్వహించగా.. ఫలితాలు, ప్రొవిజనల్ జాబితా జిల్లా వెబ్‌సైట్ srikakulam.a p.gov.inలో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంచుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలను ఈ నెల 22లోగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. మార్కులపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా నిర్దేశిత తేదీ సాయంత్రం 5 గంటల లోగా శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అధికారికి నేరుగా తెలియజేయవచ్చని తెలిపారు.

రాధాసాగరంలో వ్యక్తి గల్లంతు



గాలింపు చేపడుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు



లండ రామారావు (ఫైల్)

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం పంచాయతీ చినహంస గ్రామానికి చెందిన లండ రామారావు(49) ఒడిశా రాష్ట్రంలోని రాధాసాగరంలో గల్లంతయ్యాడు. రామారావు సోమవారం సాయంత్రం ముగ్గురు స్నేహితులతో కలిసి చేపలు పట్టడానికి వినియోగించే ఓ చిన్న నాటు పడవలో సాగరంలోకి వెళ్లారు. ప్రమాదవశాత్తూ మునిగిపోవడంతో నలుగురు నీటిలో పడిపోయారు. మిగిలిన ముగ్గురూ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోగా రామారావు గల్లంతయ్యాడు. అయితే ఈ విషయాన్ని గ్రామంలో ఎవరికీ చెప్పలేదు. మంగళవారం ఉదయం విషయం తెలియడంతో గ్రామస్తులు అందించిన సమాచారంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టారు. చీకటిపడేవరకు గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో గాలింపు నిలిపి వేశారు. ఒడిశా పరిధి కావడంతో గారబంద పోలీసులు కేసు నమోదు చేశారు. లండ రామారావుకు భార్య లక్ష్మీ ఒక కుమారుడు ఉన్నారు.

భద్రతకు భరోసా ఏదీ?

- చారిత్రక పద్మనాభుని కొండపై పాడైన సీసీ కెమెరాలు
- నిర్వహణ లేక మూలకు చేరిన పరికరాలు
- పట్టించుకోని దేవదాయ, పోలీస్ శాఖలు

జలుమూరు:

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగం క్షేత్ర పాలకుడు విష్ణుమూర్తి కరకవలస గ్రామ సమీపాన అనంత పద్మనాభ కొండపై కృష్ణార్జునులుగా కొలువుదీరి పూజలందుకుంటున్నారు. వీటితో పాటు గణపతి, లక్ష్మీదేవి, మహిషాసురమర్దిని తదితర దేవతా విగ్రహాలు కరనకవలస, అనుపురం, పరిసర గ్రామాల ప్రజలు నిత్యం పూజలు, అభిషేకాలు, అర్చనలు చేస్తుంటారు. ఏటా ధనుర్మాసంలో జిల్లా నలుమూల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. కనుమ పర్వదినాన కొండపై స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి పెద్ద జాతర నిర్వహిస్తుంటారు. ఆ సమయంలో రాష్ట్రం నలుమూలలు నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిసేవలో తరిస్తారు. ఆదాయం కూడా అధికంగానే ఉంటుంది. ఈ స్వామివారికి నిత్యం ఒక సర్పం రక్షిస్తుందని ఇక్కడి భక్తుల నమ్మకం. ఇంతటి ప్రాశస్త్యమైన ఈ ఆలయానికి రక్షణ కరువైంది. గతంలో గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాలు ధ్వంసం చేసి హుండీ కూడా ఎత్తుకెళ్లారు. అప్పటి ఎస్పీ అమిత్ బర్దార్ పరిశీలించి రక్షణకు సంబంధించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. దేవదాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిపై శ్రీముఖలింగంలోని దేవదాయ శాఖ కార్యాలయం అధికారులు, జలుమూరు పోలీసులు నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



కొండపై పూజలందుకుంటున్న స్వామివారు



అనంత పద్మనాభ స్వామి ఆలయం

పట్టించుకోని అధికారులు..

విగ్రహాల ధ్వంసం సమయంలో హడావుడి చేసిన అధికారులు తర్వాత పూర్తిగా విస్మరించారు. సీసీ కెమెరాలు, సెటాప్ బాక్స్, విజన్స్, మోనిటర్ తదితర పరికరాల్లో కొన్ని చోరీకి గురి కాగా, మరికొన్ని నిర్వహణ లోపంతో పాడైపోయాయి. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇటీవల కాలంలో చోరీలు ఎక్కువయ్యాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడంతో పాటు నిఘా పెంచాలని భక్తులు కోరుతున్నారు.



పాడైన సీసీ కెమెరాలు, పరికరాలు



కానరాని సీసీ కెమెరాలు

చర్యలు చేపడతాం..

అనంత పద్మనాభస్వామి కొండపై సీసీ కెమెరాలు మొరాయించినట్లు మా దృష్టికి కూడా వచ్చింది. క్షేత్రస్థాయి పరిశీలన చేసి నిపుణులతో మరమ్మతులు చేయిస్తాం. అవసరమైతే కొత్తవాటిని అమర్చుతాం. స్వామివారి రక్షణకు తగు చర్యలు తీసుకుంటాం.

– టి.వాసుదేవరావు, ఆలయ ఇన్‌చార్జి ఈఓ.

సహాయక చర్యలు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్ష నష్టాల అంచనా వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, దోమల నివారణకు గంబూషియా చేపలు వదలాలని, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి క్లోరిన్ టాబ్లెట్లు ఉచితంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రతి కార్యాలయాన్ని ఈ నెల 23లోగా శుభ్రం చేసుకోవాలని స్పష్టం చేశారు. పి–4 పథకం అమలులో శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో నిలిచిందని తెలిపారు. 64,166 బంగారు కుటుంబాలకు గాను 61,552 కుటుంబాలను దత్తత తీసుకున్నామని, 1,55,804 లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో కూడా జిల్లా మంచి పురోగతి సాధించిందని కలెక్టర్ చెప్పారు. 65,569 ఫిర్యాదులకు గాను 64,074 పరిష్కరించామని, 1,365 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రజాభిప్రాయ సర్వేలో విద్యుత్, ఇసుక స్టాక్ పాయింట్, ఎక్సైజ్ శాఖలపై సానుకూల స్పందన వచ్చిందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, ఇతర శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు జిల్లాలో ఆరు కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. టెక్కలి, పలాస, రాజాం, పాలకొండల్లో ఒక్కో కేంద్రం, శ్రీకాకుళంలో రెండు కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 14 బీఈడీ కళాశాలలకు చెందిన సుమారు 1100 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ నెల 22 వరకు పరీక్షలు కొనసాగుతాయని పరీక్షల డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. కాగా ఈ నెల 18న క్యాంపస్ కేంద్రంగా జరగాల్సిన మూడు, ఐదేళ్ల న్యాయ విద్య సెమిస్టర్ పరీక్షలను వర్షాల కారణంగా వాయిదా వేశామని, వీటిని సెప్టెంబర్ 2న నిర్వహిస్తామని చెప్పారు.

యథేచ్ఛగా భూఆక్రమణ!

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో భూ ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ, ప్రైవేటు భూములనే తేడా లేకుండా కబ్జాల పర్వం కొనసాగుతోంది. తాజాగా కాశీబుగ్గలో కోట్ని విజయ్‌కు చెందిన జిరాయితీ ఖాళీ స్థలంపై ఆక్రమణదారుడి కన్నుపడింది. కాశీబుగ్గ కె.టి.రోడ్డుకు ఆనుకొని ఉన్న రూ.కోట్ల విలువైన ఈ స్థలాన్ని తెలుగు దేశం పార్టీ నాయకుల అండదండలతో తాళాసు నాగేశ్వరరావు అనే వ్యక్తి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని బాధితుడు కోట్ని విజయ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తాత ముత్తాల నుంచి సంక్రమించిన జిరాయితీ భూమిలో నీలాపురం గ్రామానికి చెందిన ఓ కాంట్రాక్టరు ప్రొక్లెయినర్ తెచ్చి పునాదులు తవ్విస్తున్నాడని, దీనిపై ప్రశ్నిస్తే భవనం నిర్మాణం చేయడానికి కాంట్రాక్టు ఇచ్చారని, అందుకే పునాదులు తీస్తున్నానంటు బెదిరిస్తున్నారని లబోదిబోమంటున్నాడు. స్థలం వ్యవహారం కోర్టులో ఉందని, తీర్పు తనకు అనుకూలంగా వస్తుందని తెలిసి దౌర్జన్యంతో అక్రమంగా నిర్మాణాలు చేయడానికి పూనుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశాడు. నిర్మాణానికి మున్సిపాలిటీ అనుమతులు కూడా లేవని, అయినా అధికార పార్టీ అండతో ఈ విధంగా తనకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని విజయ్ వాపోయాడు. పోలీసు స్టేషన్‌లో కూడా తెలుగుదేశం పార్టీ నాయకుడు బెదిరించాడని, తన భూమిని కాపాడాలని పోలీసులను, మున్సిపల్ అధికారులను వేడుకుంటున్నాడు.



స్థలంలో పునాదులు తవ్విస్తున్న దృశ్యం

స్కాన్ చేస్తే ఇంటి వద్దకే విగ్రహాలు



కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్, జేసీ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వినాయక చవితికి మట్టి విగ్రహాలను పూజిద్దామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్లను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి పోస్టర్లు రూపొందించామన్నారు. కాలుష్య మండలి వారు క్యూఆర్ కోడ్‌ను తయారు చేశారని, కోడ్‌ని స్కాన్ చేస్తే ఇంటి వద్దకే విగ్రహాలు అందించే ఏర్పాటు చేయనున్నామని ఆమె తెలిపారు. అలానే 26వ తేదీన సూర్యమహల్ జంక్షన్ వద్ద స్టాల్‌ని ఏర్పాటు చేసి విగ్రహాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

సీపీఎస్ రద్దుకు ఉద్యమబాట



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగ సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న చేపట్టనున్న ఉద్యోగుల వెన్నుపోటు దినం విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు విజయవాడలో జరగనున్న ఉద్యమానికి సంబంధించి మంగళవారం కలెక్టరేట్ వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులకు వెన్నుపోటు పొడించిన దినం సెప్టెంబర్ 1న పురస్కరించుకొని గుంటూరు నాగార్జున యూనివర్సిటీ నుంచి విజయవాడ అంబేడ్కర్ విగ్రహం వరకు నలుపు వస్త్రాలు ధరించి భారీ నిరసన పాదయాత్ర చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ చల్ల సింహాచలం, నగర నాయకులు సూర్య, వంశీ, అనిల్ శ్రీనివాస్ పద్మ ప్రియా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో చోరీ

నందిగాం : నరేంద్రపురంలోని రెయ్యిబోడెమ్మ, భూలోక మాత అమ్మవారి ఆలయాల్లో సోమవారం రాత్రి పూజా సామగ్రి చోరీకి గురైంది. ఈ ఏడాది మార్చి 9న గ్రామ శివారులో గ్రామదేవతల ఆలయాలకు ప్రతిష్ఠాపన చేశారు. నిత్య పూజలకు అవసరమైన వెండి, ఇత్తడి సామాన్లు సమకూర్చుకున్నారు. సోమవారం సాయంత్రం పూజ కార్యక్రమాలు పూర్తయ్యాక తలుపులు వేసి గ్రామస్తులు వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి రెండు ఆలయాల్లో రెండు వెండి శఠగోపాలు, రెండు ఇత్తడి బిందెలు, నాలుగు ఇత్తడి పళ్లేలు, నాలుగు దీపస్తంభాలు, రెండు గంటలు, రెండు పూలసజ్జలు చోరీకి గురయ్యాయి. హుండీలో ఉన్న డబ్బులు సైతం పట్టుకుపోయారు. గ్రామస్తులు నందిగాం పోలీసులకు సమాచారం తెలియజేయగా సిబ్బంది వచ్చి పరిశీలించారు.



చోరీ జరిగిన అమ్మవారి ఆలయం